**Sakshi**

# ‘కొత్తగా జిల్లా అటవీ అధికారి పోస్టు’



సాక్షి, హైదరాబాద్: జిల్లాల పునర్ వ్యవస్థీకరణ నేపథ్యంలో కొత్తగా జిల్లా అటవీ అధికారి పోస్టును ప్రత్యేకంగా సృష్టించాలని ప్రతిపాదించినట్లు అటవీశాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. ఈ అధికారి శాఖాపరమైన పరిపాలన, ప్రాదేశిక, సోషల్ ఫారెస్ట్, లాగింగ్ వ్యవహారాలు చూస్తారని చెప్పారు. ప్రతి జిల్లాలో ఫారెస్ట్ డివిజన్లు పెంచనున్నామన్నారు. మంగళవారం సమీక్షలో అటవీశాఖ అధికారుల విధులు, కొత్త పోస్టులు, పాలనపరమైన అంశాలపై చర్చించారు. ‘ప్రస్తుతమున్న డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ పోస్టును ఇక నుంచి ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్‌గా మార్పు చేయాలని ప్రతిపాదించాం. ప్రస్తుతమున్న 22 డివిజన్లను 48కు, 5 సర్కిళ్లను 16కు పెంచుతూ ప్రతిపాదనలు సిద్ధంచేశాం. కొత్తగా 5 సీసీఎఫ్ పోస్టుల సృష్టి. 12 సర్కిళ్లలో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ఉండేలా ప్రతిపాదనలు రూపొందించాం. అటవీ విస్తీర్ణాన్ని బట్టి రేంజ్‌లను ఏర్పాటుచేయనున్నాం’ అని తెలిపారు. సమావేశంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి బీఆర్ మీనా, పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా పాల్గొన్నారు.